క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు


విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం పూజలు, అభిషేకాలు విశేషంగా జరిగాయి. తెల్లవారు జామున 5గంటల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరలు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన


108 స్వర్ణపుష్పాలతో అష్టదళా పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వర రావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీకి రానున్నది గడ్డుకాలమే..


శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: దేశంలో బీజేపీకి రానున్నది గడ్డు కాలమే అని, వారి పాలనకు రానున్న రోజుల్లో నూకలు చెల్లినట్టే అని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామచంద్రరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1209వ రోజు, మంగళవారం వారు మాట్లాడారు. తిరుగులేని అధికారంతో విర్రవీగిన బీజేపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి లాభాల బాటలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి, నాశనం చేయాలని చూశారన్నారు. వారికి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇప్పటికైనా బీజేపీ, ఎన్‌డీఏ పక్షాలు కళ్లు తెరిచి స్టీల్‌ప్లాంట్‌ను ఆదుకోకపోతే పుట్టగతులు ఉండవన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.శ్రీనివాసరావు, ఎంఎంఎస్ఎం, ఎస్టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం రైతుబాజార్ సమీపంలోని ఓ షాపు వద్ద సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయసు గల ఓ వ్యక్తి మంగళవారం ఉదయం మృతిచెంది ఉండటాన్ని షాపు యజమాని గమనించి, ఆ ప్రాంతంలోని సచివాలయం మహిళా పోలీస్‌కు సమాచారం అందించారు. వెంటనే ఆమె ఘటనా స్థలానికి చేరుకుని అక్కడ నుంచి ఐదో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, చుట్టుపక్కల ప్రజలను ఆరా తీశారు. మృతుడు రైతుబజార్ వద్ద బిక్షాటన చేస్తుంటాడని, ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళ ఎక్కడ పడితే అక్కడే నిద్రపోతుంటాడని తెలిపారు. అతడి ఎత్తు 5 అంగుళాలు, చింతపిక్క రంగు ఫ్యాంట్ ధరించి, తలకింద గళ్ల చొక్కా పెట్టుకుని ఉన్నాడు. మహిళా పోలీస్ పుష్పలత ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097
సాక్షి

పెందుర్తిలో జనసేన విజయం

- నంబరాల్లో జనసేన, టీడీపీ కేడర్


ఆర్వో శేష శైలజ నుంచి గెలుపు ధ్రువీకరణ పత్రం స్వీకరిస్తున్న పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: సార్వత్రిక ఎన్నికల్లో పెందుర్తి నియోజకవర్గంలో జనసేన విజయం సాధించింది. జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు తన సమీప ప్రత్యర్థి వైఎస్సార్ సీపీ నుంచి పోటీలో ఉన్న అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌పై 77,394 మెజారిటీ లభించింది. మంగళవారం ఏయూ కేంద్రంగా జరిగిన లెక్కింపులో పంచకర్ల తొలి రౌండ్ నుంచి స్పష్టమైన ఆధిక్యం కనబరిచారు. మరోవైపు రాష్ట్రంలో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో కేడర్ ఆనందడోలికల్లో మునిగిపోయింది. సుజాతనగర్‌లోని పంచకర్ల క్యాంప్ కార్యాలయంతో పాటు పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు వివరాలు

రౌండ్	జనసేన	వైఎస్సార్‌సీపీ	ఆధిక్యం
1	5482	3583	1899
2	6633	4045	2588
3	6159	3168	2991
4	4597	2487	2110
5	7816	3533	4283
6	7929	3377	4552
7	6388	4247	2141
8	8071	3841	4230
9	6948	2154	4794
10	7212	2892	4320
11	6444	2219	4225
12	7058	2076	4982
13	7293	2747	4546
14	6804	2246	4558
15	7522	2341	2341
16	7299	2570	4729
17	8224	2981	5243
18	7592	4729	2863
19	5587	2747	2840
20	6054	3702	2352
21	4755	2979	1776
22	5060	2029	3031

అడుగడుగునా పోలీసుల నిఘా


సబ్బవరం మూడు రోడ్లు కూడలిలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

సబ్బవరం: ఎన్నికల కౌంటింగ్ పూర్తయి ఫలితాలు వెలువడడంతో పార్టీల మధ్య వివాదాలు తలెత్తకుండా మంగళవారం పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.ఎన్నికల నియమావళి అమల్లో ఉండంతో ఎటువంటి విజయోత్సవ సంబరాలు, ఊరేగింపులు జరగకుండా గస్తీ నిర్వహించారు. విజయోత్సవంలో భాగంగా వివాదాలు,గొడవలకు దిగకుండా గ్రామాల్లోని రాజకీయ పార్టీల నేతలు హుందాగా వ్యవహరించాలని సీఐ పిన్నింటి రమణ సూచించారు. సబ్బవరం మూడు రోడ్లు కూడలిలో అధిక సంఖ్యలో పోలీసులు పహారా కాశారు.

బస్‌పాస్ కౌంటర్‌కు రెండు రోజుల సెలవు

సింహాచలం: ఆర్టీసీ బస్‌పాస్‌లు జారీ చేసే అప్లికేషన్‌ను ఆధునికీకరిస్తున్న కారణంగా సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న బస్‌పాస్ కౌంటర్‌కు ఈనెల 6,7తేదీల్లో సెలవు ప్రకటించినట్టు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. బస్‌పాస్ హోల్డర్స్ అందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రోడ్లు వెలవెల


నిర్మానుష్యంగా సబ్బవరం–చోడవరం రోడ్డు

సబ్బవరం: ఎన్నికల కౌంటింగ్ వేళ సబ్బవరం మండలంలోని పలు రోడ్లు వెలవెల బోయాయి.వాహనాల రాకపోకలు లేక మంగళవారం రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలవడడంతో ప్రతి ఒక్కరూ టీవీలకు హత్తుకుపోయి కనిపించారు.ఎన్నికల ఫలితాల సరళిని ఉత్కంఠగా తిలకించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

మధురవాడ : జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెంలో అక్రమంగా 8 మద్యం సీసాలు కలిగి ఉన్న మహిళను పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం ఒక మహిళ మద్యం అమ్ముతున్నట్టు అందిన సమాచారం ప్రకారం సీఐ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ఎస్.లక్ష్మి అనే మహిళను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్టు సీఐ రామకృష్ణ చెప్పారు. 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

మామిడి లోడుతో వ్యాన్ బోల్తా


గోస్తనీ నది వంతెనపై మామిడి లోడుతో బోల్తా పడిన వ్యాన్


వ్యాన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ విఘ్నేష్‌ను వెలుపలకు తీస్తున్న సిబ్బంది

తగరపువలస : స్థానిక గోస్తనీ నదిపై గల జాతీయ రహదారి వంతెనపై మంగళవారం మధ్యాహ్నం మామిడికాయల లోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ బోల్తా పడిన సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ ప్రమాదం కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పశ్చిమ బెంగాల్ నుంచి తమిళనాడుకు మామిడికాయల లోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ వంతెన పైకి చేరుకుంటున్న సమయంలో సేలం ప్రాంతానికి చెందిన డ్రైవర్ విఘ్నేష్ నిద్ర మత్తు కారణంగా డివైడర్‌పైకి చేరి వంతెన గోడను ఢీకొట్టాడు. దీంతో ఐషర్ రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో అందులోని మామిడికాయలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదం జరిగే ముందు ఆవును తీసుకెళ్తున్న మరో వ్యాన్‌ను ఐషర్ వ్యాన్ ఢీకొట్టింది. ఐషర్ వ్యాన్ ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ విఘ్నేష్ కాలు ఇరుక్కుపోయింది. దీంతో భీమిలి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, నేషనల్ హైవే సిబ్బంది, తాళ్లవలస అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని శ్రమించి విఘ్నేష్‌ను బయటకు తీశారు. ముందు వ్యాన్‌లో ఉన్న ఆనందపురం మండలం వేమగొట్టిపాలేనికి చెందిన ఆదినారాయణ, మరో వ్యక్తికి గాయాలు కావడంతో ముగ్గురిని సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎట్టకేలకు ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ


పుష్పాల అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస : భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. ఈ అలంకరణకు కనకాంబరం, మల్లెలు, డిశంబరు, గులాబీ పువ్వులు, తులసి మాలలు వినియోగించారు. ఈ సందర్భంగా అమ్మవారి అలంకరణకు, భక్తులకు ప్రసాదాల పంపిణీకి మజ్జివలసకు చెందిన చిల్ల అప్పారావు, మంగ, తుపాకుల అప్పల రాసయ్య, రాసమ్మ దంపతులు సహకారం అందించారు.

ప్రశాంతతకు నిలయం..ప్రసన్న వేంకటేశ్వరాలయం

- ప్రసన్నగిరిపై కొలువుదీరిన స్వామి
- తొలి పూజలందుకుంటున్న బాల వినాయకుడు
- దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి


భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల వేంకటేశ్వర, వినాయక స్వామి దేవస్థానం


ఆలయానికి సిద్ధం చేస్తున్న స్టీల్ గేట్లు

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న గిరిపై ఉన్న ప్రసన్న వేంకటేశ్వర, వినాయక ఆలయాలు సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. దాతల సహకారంతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకువస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేస్తున్నారు.

శ్రీకారం చుట్టిన బీహెచ్‌పీవీ ఉద్యోగులు

బీహెచ్‌పీవీ ఉద్యోగులంతా కలిసి సంస్థకు ఎదురుగా ఉన్న కొండపై కొద్దిపాటి ఎత్తులో 1976లో ముందుగా బాలవినాయకుడి ఆలయాన్ని నిర్మించారు. అనంతరం కొండపై ప్రసన్న వేంకటేశ్వరాలయాన్ని నిర్మించారు. అప్పట్లో గాజువాకలోనే కాకుండా నగరంలోనే ప్రసన్న వేంకటేశ్వరాలయం చిన్న తిరుపతిగా ప్రసిద్ధి చెందింది. దీనిని 2002లో దేవదాయ శాఖ స్వాధీనం చేసుకుంది. ఇప్పటికీ ఆలయంలో జరిగే ప్రధాన ఉత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాల్లో భెల్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి

ఆలయాన్ని దాతల సహకారంతో పాలకమండలి సభ్యులు అభివృద్ధి చేస్తున్నారు. వినాయక ఆలయ ముఖద్వారం స్టీల్ గేట్లతో కొత్త రూపును సంతరించుకుంది. గుడి లోపల స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయానికి ఇరువైపులా, వెనుక పూర్తిగా మార్బుల్ గచ్చులతో పాటు ఎండ, వానల్లో భక్తులకు ఇబ్బందులు లేకుండా షెడ్డును నిర్మించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించే భక్తులకు ఈ షెడ్లు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయని అంటున్నారు. గతంలో వృద్ధులు ఆలయానికి వెళ్లాలంటే మెట్లు ఎక్కడానికి ఎంతో ఇబ్బంది పడేవారు. ఇప్పుడు ఆలయానికి నడక, వాహన మార్గం ఏర్పాటుతో ఎంతో సౌలభ్యంగా మారిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ప్రసన్న వేంకటేశ్వరాలయం చుట్టూ నిర్మించిన షెడ్డులో ఒక భాగం

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకుడు పవన్‌కుమారాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

హనుమాన్ కాలనీలో తాగునీటి ఎద్దడి

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం శివారు హనుమాన్ కాలనీలో కొన్ని రోజుల నుంచి మంచి నీటి ఎద్దడితో కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించడానికి చర్యలు తీసుకోలేదని కాలనీకి చెందిన హనుమాన్ యూత్ సభ్యులు ఆరోపించారు. కాలనీలో ఏర్పాటు చేసిన రెండు మంచినీటి పథకాల్లో ఒకటి మరమ్మతులకు గురైంది. ఒక్క బోరు బావే ఉండడంతో వేసవికాలంలో తాగునీటి కోసం పరవాడలోని ఆర్వో ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తుందని వాపోతున్నారు. మంచినీటి పథకాలకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మికి రెండు నెలల కిందట వినతిపత్రం అందజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు వాపోతున్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని హనుమాన్ యూత్ సభ్యులు కోరారు.

దుర్గమ్మ వారికి పసుపు కుంకుమల సమర్పణ


ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మవారు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి గ్రామ దేవత శ్రీ దుర్గమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం దొండపర్తి గ్రామస్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్ మాట్లాడుతూ 10వ తేదీన పుట్టబంగారం తీసుకురావటంతో పాటు అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు.

12 నుంచి 'మిషన్ లైఫ్'

- ఎకో క్లబ్స్ ద్వారా పాఠశాలల్లో పర్యావరణ చైతన్య కార్యక్రమాలు
- ఏపీఎన్‌జీసీ జిల్లా కో–ఆర్డినేటర్ ఖగేశ్వరరావు



అగనంపూడి: ఏపీ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రతీ పాఠశాలలో మిషన్ లైఫ్ కార్యక్రమం నిర్వహించాలని ఏపీఎన్‌జీసీ అనకాపల్లి జిల్లా కో–ఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్షా ఎస్‌పీడీ ఆదేశాలు, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ సూచనల మేరకు పాఠశాలల్లో ఎకో క్లబ్‌ల ద్వారా నిర్వహించాలని కోరారు. వీటిలో భాగంగా 5వ తేదీన ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, వస్తువులు వాడకుండా ఉండడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా ర్యాలీలు నిర్వహించడం, మొక్కలు నాటడం చేయాలని తెలిపారు.

ఇదీ షెడ్యూల్

- 12వ తేదీన నీటిని ఆదా చేయడం, పాఠశాలల్లోని పైప్‌లైన్ల లీకేజీలు అరికట్టడం, నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించడం, నీటి సంరక్షణ అవగాహన ర్యాలీలు నిర్వహించాలని తెలిపారు.
- 13వ తేదీన శక్తిని ఆదా చేయడం, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు, ఎనర్జీ టీమ్‌లు, క్లబ్‌లు ఏర్పాటు చేయడం, పోస్టర్లు, బ్యానర్లు తయారు చేయాలన్నారు.
- 14వ తేదీన వ్యర్థాలను తగ్గించడం, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం, తరగతి గదుల్లో డస్ట్‌బిన్‌లు వాడడం విద్యార్థులకు అలవాటు చేయడం, శానిటరీ వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువులు చేయడం, కమ్యూనిటీ సభ్యులతో ఇంటరాక్ట్ అవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.
- 15వ తేదీన ఈ వ్యర్థాలను తగ్గించడం, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో ఈ వ్యర్థాలను సేకరించడం, భూమిపై ఈ వ్యర్థాల ప్రభావంపై పిల్లలతో చర్చించడం చేయాలి.
- 18వ తేదీన స్థిరమైన ఆహార వ్యవస్థ, కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేయడం, వ్యర్థాలతో పర్యావరణ అనుకూల ఎరువులు, మొక్కల పెరుగుదల, పర్యావరణ ప్రయోజనాలపై చర్చించడం చేయాలని తెలియజేశారు.
- 19వ తేదీన ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, నేచర్ వాక్, ప్లాంటేషన్ డ్రైవ్, పర్యావరణ శాస్త్రం, చరిత్ర, భౌగోళిక ఆచారాలు, సంప్రదాయాలను పరిశీలించడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకొని ఉపాధ్యాయులు, విద్యార్థులను భాగస్వాములను చేయాలని ఆయన కోరారు.

పోలీస్ దిగ్బంధంలో ఏయూ పరిసరాలు


మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరువలో పోలీసుల పికెట్


వాహన చోదకుడికి బ్రీత్ ఎనలైజర్ టెస్ట్ చేస్తున్న పోలీసులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మంగళవారం పోలీసు దిగ్బంధంలోకి వెళ్లిపోయింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను భద్రపరచడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియ వంటివి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా సాగాయి. మంగళవారం నిర్వహించిన ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి మద్దిలపాలేనికి వెళ్లే రహదారిని పూర్తిగా పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మద్దిలపాలెం కూడలి వద్ద, మూడో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఉదయం ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వచ్చిన పోలింగ్ ఏజెంట్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతనే లోపలికి పంపారు. వారికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేశారు. ఆ తరువాతనే ఏజెంట్లను లోపలికి పంపారు.

పోటీ చేసిన అభ్యర్థులను సైతం పోలీసులు తనిఖీలు చేశారు. అభ్యర్థి, కారు డ్రైవర్, ఒక సెక్యూరిటీని మాత్రమే లోపలికి అనుమతించారు. మంత్రి గుడివాడ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణలను సైతం ఇదే విధంగా తనిఖీ చేసి పంపారు. నగరంలో ప్రతి వార్డులో ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలలో పోలీసులు పికెటింగ్ నిర్వహించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముందు జాగ్రత్తగా బందోబస్తు నిర్వహించారు.

చంద్రంపాలెం హైస్కూల్‌లో చురుగ్గా అడ్మిషన్లు

- ప్రవేశం కోసం విద్యార్థుల ఆసక్తి
- సకల వసతులతో ఆకట్టుకుంటున్న పాఠశాల


అడ్మిషన్స్ ప్రక్రియలో ఉపాధ్యాయులు

మధురవాడ : రాష్ట్రంలోనే పెద్దదైన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ పాఠశాలలో ఏటా 1000 మందికిపైనే విద్యార్థులు చేరుతూ ఉంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక పెద్ద పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య కంటే ఇక్కడ కొత్తగా ఏటా చేరే వారే ఎక్కువ అంటే అతిశయోక్తి కాదు. విద్యా బోధన, క్రమశిక్షణతో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నిలుస్తోంది. అందుకే ప్రభుత్వ పాఠశాలలతోపాటు ప్రైవేటు స్కూళ్ల నుంచి విద్యార్థులు ఇక్కడకు వచ్చి చేరుతుంటారు. ఈ ఏడాది మాత్రం రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన వారు కూడా పాఠశాలలో చేరడానికి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. గత విద్యా సంవత్సరం ముగిసే నాటికి ఇక్కడ 3,706 మంది విద్యార్థులున్నారు. కొత్తగా ఈ ఏడాది పాఠశాలలో చేరడానికి ఇప్పటికే సుమారు 515 మంది ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఎంపిక చేసుకున్నారు. సుమారు 160 మంది ఇప్పటికే ఇక్కడ 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశం పొందారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం, విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లు, డిజిటల్ విద్య, నాణ్యమైన 'జగనన్న గోరు ముద్ద' మధ్యాహ్న భోజనం, జీవీవీ కిట్స్‌తోపాటు 'నాడు – నేడు' ద్వారా రూ.2 కోట్లు వెచ్చించి పాఠశాలను ఆధునికీకరించారు.

ఇవీ హైస్కూల్‌లో ప్రత్యేకతలు

- చంద్రంపాలెం హైస్కూల్‌లో బాల, బాలికలు వేర్వేరుగా ఎన్‌సీసీలో శిక్షణ, స్కౌట్స్ అండ్ గైడ్స్, గ్రీన్ క్రాప్స్, కంప్యూటర్ విద్య, ప్రత్యేకంగా లైబ్రరీ, ల్యాబ్, క్రాఫ్ట్, డ్యాన్స్, ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు.
- జాతీయ రహదారిని ఆనుకుని సుమారు 60 తరగతి గదులు, సువిశాల పరిసరాలు, ఆట స్థలం, అందులో బాస్కెట్ బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ వంటి కోర్టులు అందుబాటులో వున్నాయి.
- ఇక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతోపాటు ట్రిపుల్ ఐటీ సీట్లు కూడా సాధిస్తున్నారు. అలాగే ఏ క్రీడా పోటీలకు వెళ్లినా బహుమతులు సాధిస్తున్నారు. ఇలాంటివన్నీ విద్యార్థులు ఈ హైస్కూల్‌లో చేరేందుకు విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com